క్లుప్తంగా

తిరుమలగిరి మండలానికి పీహెచ్‌సీ మంజూరు

హాలియా : సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిర్మాణానికి రూ.1.43కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం చేపట్టనున్నారు. కుందూరు జయవీర్ రెడ్డి తిరుమలగిరి మండలంలో గతంలో చేపట్టిన గిరిజన చైతన్య యాత్రలో భాగంగా ప్రతి తండా, ప్రతి గుడిసె తిరిగి అక్కడి గిరిజనులు పడుతున్న ఇబ్బందులు, వారి అనారోగ్య స్థితులపై ఆరా తీసి వారికి ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించి గిరిజనులకు మాటను నెరవేర్చారు. మండల కేంద్రానికి నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కావడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఇందిరమ్మకాలనీలోని సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మకాలనీ, కాల్వగట్టుతండా, గూడూరు బైపాస్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రహీం



మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఎస్‌కె రహీం ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రకటించింది. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హజారుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఆరిఫ్‌లతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఎస్పీకి వినతి

మిర్యాలగూడ అర్బన్ : ఆరేళ్ల కింట అదృశ్యమై నేటికీ ఆ వ్యక్తి ఆచూకీ దొరకడం లేదని, అతడి ఆచూకీ తెలుసుకోవాలని కోరుతూ మిర్యాలగూడ పట్టణం సంతోష్‌నగర్‌కు చెందిన పొట్టు ముత్తు పద్మ సోమవారం ఎస్పీ శరత్‌చంద్రా పవర్‌కు ఫిర్యాదు చేసింది. తన భర్త పొట్టు ముత్తు సుదర్శన్ 2018 జులై 13 నుంచి కనిపించకుండా పోయాడని, అప్పట్లో మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వెతికామని ఎక్కడా ఆచూకీ లభించలేదని, ఇప్పటికైనా తప్పిపోయిన తన భర్త సుదర్శన్‌ను వెతికి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఉల్లాస్ ట్రస్ట్ సహకారం అభినందనీయం

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్ట్ సహకారం అభినందనీయమని త్రిపురారం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చల్లా రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతికనబర్చే విద్యార్థుల ఉల్లాస్ ట్రస్ట్ రూ.10500 ఆర్థిక సాయం అందజేసింది. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరా రెడ్డి, పద్మ, శీనయ్య, లక్ష్మీ నర్సయ్య, వెంకన్న, శ్రీనివాస్, విష్ణు కుమార్, సైదా, జానకమ్మ, పద్మావతి, ఏడుకొండలు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నాగార్జునసాగర్ : ఈ నెల 14న నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. నిడమనూరు కోర్టు పరిధిలో నమోదైన కేసులకు సంబంధించిన కక్షిదారులు రాజీ చేసుకోవాలని కోరారు.

అడవిదేవులపల్లి : జాతీయ లోక్‌అదాలత్ ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అడవిదేవులపల్లి ఎస్‌ఐ శేఖర్ ఒక ప్రకటనలో కోరారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు రాజీమార్గమే రాజమార్గం అని, రాజీపడేవారు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

రిటైర్డ్ టీచర్ల అనుభవాలు ఆదర్శంగా తీసుకోవాలి

అడవిదేవులపల్లి : ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల అనుభవాలను ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని దామరచర్ల ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గౌరు వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, వెంకట్‌రెడ్డి, కేఎల్‌ఎన్ మూర్తి, రవీందర్‌రెడ్డి, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ‘నక్షా’ సర్వే

- గృహాలు, ఆస్తుల గుర్తింపు, పటాల రూపకల్పన
- ప్రతి ఇంటికీ డిజిటల్ కార్డు
- పైలెట్ ప్రాజెక్టుగా మిర్యాలగూడ ఎంపిక



మిర్యాలగూడ పట్టణ వ్యూ

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో భూ రికార్డులను ఆధునీకరించేందుకు ‘నక్షా’ సర్వే త్వరలో ప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్(ఎన్‌ఏకేఎస్‌హెచ్‌ఏ-నక్షా) సర్వేను డ్రోన్ల ద్వారా చేపట్టేందుకు ముందుకుతీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా 100 పట్టణాలను ఎంపిక చేయగా అందులో మిర్యాలగూడ మున్సిపాలిటీకి చోటు దక్కింది. ఇందుకు సంబంధించిన అధికారులు సాధారణంగా అన్ని వార్డులను తిరిగి సర్వే చేసేందుకు రెవెన్యూ, మున్సిపాలిటీ, సర్వే సిబ్బందితో పాటు సర్వే కోసం ప్రత్యేక బృందాలను నియమించనున్నారు. కాగా ఈ సర్వే జనవరి కానీ ఫిబ్రవరి నెలలో పది రోజుల పాటు డ్రోన్ ద్వారా సర్వే చేయనున్నారు. ఈ సర్వే చేసే బృందాలకు త్వరలోనే శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

త్వరలో ఇంటింటి సర్వే..

నక్ష సర్వేలో భాగంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇంటింటి సర్వేను చేపట్టనున్నారు. ఇంటి స్థలాన్ని కొలిచి, దస్త్రాల వివరాలను నమోదు చేసుకోనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించి వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల వివరాలను కూడా పూర్తి స్థాయిలో సేకరించనున్నారు. సర్వే కోసం ప్రత్యేకంగా రోవర్ యంత్రాలను వినియోగించనున్నారు. సర్వే సమయంలో మున్సిపాలిటీలోని సరి హద్దులను నిర్ధయించనున్నారు. దీంతో మున్సిపాలిటీ మొత్తం ఎంత విస్తీర్ణంలో ఉందో తెలనున్నది. నక్షా సర్వే కోసం రెండు నోటీసులను జారీ చేయనున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శాఖల విభాగాలు ఈ సర్వే పరిధిలోని రానున్నాయి. నక్షా సర్వే అనంతరం మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి గుర్తింపు కార్డులను జారీ చేయనున్నారు. గుర్తింపు కార్డుల జారీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పట్టణ వాసులు పూర్తి స్థాయిలో సులువుగా అందే అవకాశం ఉంది.అలాగే బ్యాంక్ రుణాలు తీసుకునేందుకు వీలుగా ఉంటుంది.

డ్రోన్‌ల సహకారంతో సర్వే



“ మిర్యాలగూడ మున్సిపాలిటీలో త్వరలోనే నక్ష సర్వే జరగనున్నది. జనవరి చివరి వారంలో కానీ ఫిబ్రవరి మొదటి వారంలో కానీ ఈ సర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరుగుతుంది. మున్సిపాలిటీలోని ప్రతి ఇంచును కూడా వదలకుండా హద్దులను ఏర్పాటు చేస్తారు. త్వరలో ఈ సర్వే కోసం సిబ్బందిని నియమించనున్నారు. తరువాత నియమించిన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తాం.

\- మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

నూతన మాస్టర్ ప్లాన్ తయారీకి..

అలాగే కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద డ్రోన్ కెమెరాలతో ఈ సర్వేను చేపట్టనున్నారు. వీటి ద్వారా సేకరించిన సమాచారం వివరాలు చిత్రాలను క్రోడీకరించి నివేదికను రూపొందించనున్నారు. ఇప్పటికీ పాత మాస్టర్ ప్లానే కొనసాగుతుంది. 2050ని దృష్టిలో పెట్టుకొని నూతన మాస్టర్ ప్లాన్ తయారుచేసే అవకాశం ఉంది. విద్యుత్ దీపాలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, తాగునీటి పైపులైన్లు, సెల్ టవర్లు, తాగునీటి రిజర్వాయర్లు, వైకుంఠధామాలు సేకరించి బేస్ మ్యాప్‌ను రూపొందించనున్నారు.

కాంగ్రెస్ తల్లిగా మార్చారు : మాజీ ఎమ్మెల్యే



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడుతున్న నోముల భగత్

హాలియా : ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చిన సీఎం రేవంత్ రెడ్డి దుశ్చర్యంతో తెలంగాణ తల్లి కన్నీరు పెడుతుందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన అపచారానికి నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం హాలియా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, మాజీ ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ కలిసి ఆ పార్టీ శ్రేణులు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి వారు పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మిర్యాలగూడ : బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, అంగోతు లలితహాతీరాంనాయక్, ధనావత్ బాలాజీనాయక్, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులుయాదవ్, ఎండి.ఇలియాస్, కరీం, అయిలి వెంకన్న, అంజన్ రాజు, శ్రీనివాస్‌యాదవ్, గుడిసె దుర్గాప్రసాద్, పెండ్యాల పద్మ, కోదాటి రమా, ఉమా, ధనమ్మ, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘సాక్షి’ స్పెల్ బీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ జయరాజన్



ప్రతిభ చాటిన వర్డ్ అండ్ డీడ్ విద్యార్థులు

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 24న ‘సాక్షి’ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ ఇంగ్లీష్ నైపుణ్యత పరీక్షలో మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి సెమిఫైనల్‌కు ఎంపికైనట్లు కెకె. జయరాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటగిరి-3లో ఏడో తరగతి చదవుతున్న ఎం.ప్రద్యున్‌గౌడ్, కేటగిరి -4లో 8వ తరగతి చదువుతున్న కెకె.అశ్విజయరాజన్, బి.ఇందులతలు, 10వ తరగతి చదువుతున్న రాధికశర్మలు సెమీ ఫైనల్‌కు ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పెల్‌బీ సెమీ ఫైనల్‌కు వర్డ్ అండ్ డీడ్ విద్యార్థులు

పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాల విద్యార్థుల సాక్షి స్పెల్‌బీ కాంటెస్ట్ సెమీఫైనల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎండీ.కలీమ్ మంగళవారం తెలిపారు. కేటగిరి-1 నుంచి కె.గాత్రిశ్రీ, కేటగిరి-2 నుంచి ఎండీ.సిద్రాముస్కాన్‌లు ప్రతిభ చూపి హైదరాబాద్‌లో నిర్వహించే సెమీ ఫైనల్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ.మునీర్ అన్నారు. ఇటీవల హనుమకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాక్సింగ్ పోటీల్లో మిర్యాలగూడ మండలం తుంగపాడు ఆదర్శ విద్యాలయం విద్యార్థిని లొడ్డ లావణ్య రజిత పతకం సాధించింది. మంగళవారం జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లావణ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తాజ్ బాబా, సోఫియా, గోపి, యాదగిరి, రామకృష్ణ, నాగయ రాఘవ, సీతారం, రఫి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ కొండూరు భవాని అన్నారు. మంగళవారం గోడకొండ్లలో మాల్ వెంకటేశ్వర్‌నగర్‌కు చెందిన పద్మావతి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉచిత వైద్యశిబిరంలో చూసిన వ్యక్తులకు వారికి ఇచ్చిన చిట్టి తీసుకొస్తే మూడు నెలల వరకు ఉచితంగా ఓపీ చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవర్ధన్, నాయకులు మాస భాస్కర్, గ్యార.పోశయ్య, రమేష్ ,గణేష్, డాక్టర్ .హుస్సేన్, ఇన్‌చార్జ్ .శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ , ఓంకార్, రాజు, కృష్ణ, శివ, శ్రీనివాస్ ఉ న్నారు.

సీఎం కప్ పోటీలు బాధ్యతగా నిర్వహించాలి



పెద్దవూర : మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

త్రిపురారం : సీఎం కప్ క్రీడా పోటీలను అధికారులు సమన్వయంతో బాధ్యతగా నిర్వహించుకోవాలని త్రిపురారం ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 11, 12వ తేదీల్లో త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై పీడీ, పీఈటీలు, మండల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆటలకు హాజరయ్యేవారు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాలని, ఉదయం 11గంలకు పోటీలు ప్రారంభమవుతాయని, మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, ఎంపీఓ సుధీర్‌కుమార్, ఏఎస్‌ఓ దీప, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, ఏడు కొండల్, అంజయ్య, లలిత, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం అయ్యేలా చూడాలని ఎంపీడీఓ మానె ఉమాదేవి అన్నారు. మంగళవారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి పోటీలలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ తరిరాములు, పీడీలు శోభారాణి, మురళీ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలని వినతి



మిర్యాలగూడ టౌన్ : సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు బీసీ సంక్షేమ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది పేద విద్యార్థులు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లపై ఎక్కువ శాతం ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. మూడేళ్లుగా ఫీజురీయంబర్స్‌మెంటు ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ఒరిజనల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక పోయారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు మహేశ్వరపు నరేష్, హరి గౌడ్, ఉపేందర్, అజయ్, గంగాధర్ ఉన్నారు.

దేవరకొండ : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డికి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, కృష్ణాచారి, రాజారావు, రాములు, కోటేష్, మోహన్, చంద్రమౌళి, శ్రీను, వెంకటేష్, అంజిగౌడ్ ఉన్నారు.

కోర్టు పరిధిలో ఉన్న భూమి రిజిస్ట్రేషన్

- ఫిర్యాదు చేసినా తహసీల్దార్ పట్టించుకోలేదని బాధితుడి ఆరోపణ
- ఎంట్రీ మార్ట్ లేకపోవడంతోనే రిజిస్ట్రేషన్ చేశానంటున్న తహసీల్దార్

కొండమల్లేపల్లి : కోర్టు పరిధిలో ఉన్న భూమిని కొండమల్లేపల్లి తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ రిజిస్ట్రేషన్ చేశాడని బాధితుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. వివరాల్లోకి వెళ్తే కొండమల్లేపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామ శివారులోని సర్వేనంబర్ 76/అ/1/1/1లో 3.20ఎకరాల అదే గ్రామానికి చెందిన బొడ్డు పార్వతమ్మ కుమారుడైన రామకృష్ణది. అయితే అతడు కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పని చేస్తున్నాడు. ఆ భూమికి సంబంధించి వివాదం ఉండడంతో ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని రామకృష్ణ తెలిపారు. కోర్టు కేసు నెం. 301/2022గా తెలిపాడు. ఇదిలా ఉంటే ఈనెల 16న భూమికి సంబంధించి కోర్టులో విచారణ ఉంది. కాగా బండారు పార్వతమ్మ, వెంకయ్య దంపతులు, బండారు శ్రీనివాస్, బండారు నాగమురళీలు ఈనెల 2వ తేదీన స్లాట్ బుక్ చేసుకొని 3న వారి పేరిట ఒక్కొక్కరికి 1.30 ఎకరాల చొప్పున స్థానిక తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. కోర్టు పరిధిలో ఉనన భూమి రిజిస్ట్రేషన్ చేయొద్దని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపాడు. కాగా కోర్టు పరిధిలో ఉన్న భూముల జోలికి వెళ్లొద్దని ఉన్నతాధికారులు చెబుతున్నా సదరు తహసీల్దార్ కోర్టు పరిధిలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్‌చేసినట్లు రామకృష్ణ పేర్కొన్నాడు. ఈవిషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా చెన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని ఆ సర్వే నంబరల్‌లోని 3.20కి భూమికి సంబంధించి స్లాట్ బుక్ అయినది. ఆ భూమికి సంబంధించి ఎంట్రీ మార్ట్ (కోర్టు పరిధిలో ఉన్నదా లేదా అనే విషయం) లేదని, ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి కోర్టు వివాదంలో ఉన్న విషయం తమకు ఎలాంటి సమాచారం లేదని, కోర్టు వివాదంలో ఉంటే స్లాట్ బుక్ కాదని, స్లాట్ బుక్ కావడంతోనే రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నాడు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మిర్యాలగూడ టౌన్ : పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాజా కూరగాయలతో నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలి ఎంఈఓ బాలు అన్నారు. మంగళవారం పట్టణంలోని సెయింట్ మేరీ హైస్కూల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించగా ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన కమిటీని నియమించాలని, పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సివిల్ లిస్టను డిస్‌ప్లే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంగ్యానాయక్, కరుణాకర్‌రెడ్డి, మంగళ, ధర్మానాయక్, శ్రీనివాస్‌రావు, గణేష్, శిరీష, గోపి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని అశోక్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపుర లోని జిల్లా పరిషత్ ఉర్దు మీడియం, ఎన్‌ఎస్‌పీ క్యాంపులోని ప్రాథమికోన్నత పాఠశాలలను మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించి అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ జాఫర్, ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ముత్యాలు మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మాజీ సర్పంచ్ అందుగుల ముత్యాలు మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ముత్యాలు మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్



మిర్యాలగూడ టౌన్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన ఆశా వర్కర్లు

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల్లోని ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించడానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నాలో పాల్గొనడానికి హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆశా కార్యకర్తలను మంగళవారం ఉదయం అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. దీంతో పలువురు ఆశ కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తు ప్రభుత్వం వెంటనే డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా ఆశా వర్కర్లను మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడారు. అరెస్ట్ అయిన వారిలో మచ్చ అరుణ జ్యోతి, మచ్చ విద్యారాణి, కె. లక్ష్మి, ఎర్ర ఇన్నమ్మ, సత్యావతి, సలోమి, కె, అరుణ, కల్యాణి, రుక్మిణి, పి. గీత, సుజాత ఉన్నారు.

వేములపల్లి(మాడుగులపల్లి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ‘చలో అసెంబ్లీ’కి వెళ్తున్న ఆశా కార్యకర్తలను మాడుగులపల్లి పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సుజాత, జయమ్మ, మంగమ్మ, చంద్రకళ, గిరిజ, సుజాత తదితరులు ఉన్నారు. అదేవిధంగా వేములపల్లి నుంచి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఆశాలు ఝాన్సీ, రేణుక, నాగమ్మ, కౌసల్య, దేవకమ్మ, సీపీఎం నాయకులు సైదులు, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



నిడమనూరులో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మార్కెట్ చైర్మన్ సత్యం

త్రిపురారం : మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిల ఆర్థిక సహకారంతో నిడమనూరు మండలంలోని కేజీబీవీ విద్యార్థులకు మంగళవారం దుప్పట్లను నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అందజేశారు. ఈ సందర్భంగా అంకతి సత్యం మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మండలానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్, పోలె రవి, విశ్వనాదు ర మేష్, సతీష్, నకిరెకంటి సైదులు, మేరెడ్డి వెంకటరమణ, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలకేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, బీసీ బాలుర వసతిగృహం, మైనార్టీ కళాశాల పిట్టలగూడెం మైనార్టీ కళాశాల వసతిగృహ విద్యార్థులకు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి సొంత నిధులతో సమకూర్చిన దుప్పట్లను స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, దేవరకొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తగుళ్ల సర్వయ్య మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాధవీ జగదీశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి యాదగిరి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎస్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులతో లేబర్ కార్డు ఉన్న కార్మికులకు 52రకాల టెస్ట్‌లను మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానంగా బీపీ, షుగర్, థైయిరాడ్‌తో పాటు పలు రకాల టెస్ట్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషన్లు సాల్మన్, సమిరలు, ఉన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

చందంపేట : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నేరెడుగొమ్ము మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.లాలుపేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న అండర్ -19 హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మంగళవారం విద్యార్థినిని అభినందించారు. ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించే పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ కె.శ్రీను, పాల్గొన్నారు.

సెలవు కోరుతూ సీడీపీఓకు వినతి

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 12న హైదరాబాద్ వెళ్తున్నందున సెలవు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమతకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌రెడ్డి, పార్వతి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ దరఖాస్తులను తిరస్కరించాలి

పెద్దవూర : ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొందరు నకిలీ దరఖాస్తులు ఇస్తున్నారని వస్తున్న వదంతుల నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్ సరోజ పావనికి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ నజీముద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

హాలియా : ప్రభుత్వం పేదలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ ధర్మ పోరాటం అనుముల మండల అధ్యక్షుడు మామిడి రవి అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గోవర్ధన్, వంశీ, శివశంకర్, లక్ష్మణ్, ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 71, 72వ బూత్ కమిటీలను మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. అనంతరం 71 బూత్ కమిటీ అధ్యక్షుడిగా పంగ శ్రీనివాస్, 72వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కేసరి శంకర్‌లను నియమించి వారికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు నియామక పత్రం అందజేశారు